
చేతనైనంత కాలం
పనిచేస్తానే..
● ఆరు పదుల వయసులోనూ ఆత్మగౌరవంతో జీవనం
● ఆదర్శంగా నిలుస్తున్న వృద్ధులు 6

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 5
మంగళవారం 17 జూన్ 2025



చంద్రశేఖర్‌ను అభినందించిన జగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎంఆర్ఎఫ్ పరిశ్రమ కార్మిక సంఘం ఎన్నికల్లో గెలిపొందిన కొత్తగొల్ల చంద్రశేఖర్, సంఘం కార్మిక పోరాట సమితి నాయకులను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అభినందించారు. ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో పనిచేసే కార్మికులకు అండగా ఉండాలని అన్నారు. కార్మికులకు ఏమైనా సమస్యలు ఉంటే తనదృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణ, ఉపాధ్యక్షులు కృష్ణ, విఠల్, కార్యదర్శి శ్రీనివాస్ రాజు, ప్రధాన కార్యదర్శి మల్లేశం, నాయకులు నజీర్, కిరణ్, వెంకట్‌రావ్, నర్సింహులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


హైదరాబాద్‌లో చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

ఇంకా కొందరు బీఆర్ఎస్‌కే పని..

● వారిని తక్షణమే బదిలీ చేయండి
● మంత్రి వివేక్‌ను కలిసిన సిద్దిపేట నాయకులు

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూన్ 16: జిల్లాలోని పలువురు జిల్లా స్థాయి ఉన్నతాధికారులు, సిబ్బంది ఇంకా బీఆర్ఎస్ నాయకులకే పనిచేస్తున్నారని, అలాంటి వారిని తక్షణమే బదిలీ చేయాలని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్‌లు రాష్ట్ర భూగర్భ గనులు, కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామిని కోరారు. సోమవారం హైదరాబాద్‌లో మంత్రి వివేక్‌వెంకటస్వామిని కాంగ్రెస్ నాయకులు మైనంపల్లి హన్మంతరావుతో కలిసి వెళ్లారు. ఈ మేరకు సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన ఆయా మండలాల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షుడుతో పార్టీ బలోపేతం, స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై మంత్రి ఆరా తీశారు. ఈ మేరకు ఈ నెల 23న సిద్దిపేటలో కాంగ్రెస్ నాయకులు, కార్యాకర్తలతో సమావేశం నిర్వహిస్తానని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు.


హైదరాబాద్‌లో మంత్రి వివేక్‌ను కలిసిన సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు

ఇంటర్ సప్లమెంటరీ ఫలితాలు విడుదల

సిద్దిపేట కల్చరల్, జూన్16 (ఆంధ్రజ్యోతి): గత నెల 22 నుంచి 29 వరకు నిర్వహించిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్ష ఫలితాలను సోమవారం విడుదల చేశారు. జిల్లాలో 3,147 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1843 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 58.56 ఉత్తీర్ణత శాతం నమోదైందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు. ఒకేషనల్ గ్రూప్ 730 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 502 మంది ఉత్తీర్ణత సాధించారు. 68.77 ఉత్తీర్ణత శాతం నమోదైంది. జనరల్ మొదటి సంవత్సరం విద్యార్థులు 4,688 మంది పరీక్ష రాయగా 2,832 మంది పాసయ్యారు. 60.41 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ మొదటి సంవత్సరంలో 924 మంది విద్యార్థులకు 626 మంది పాసయ్యారు. 67.75 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని డీఐఈవో రవీందర్ రెడ్డి తెలిపారు.

బీసీని సీఎం చేసే దమ్ము
కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఉందా?
● ముదిరాజ్‌లు రాజకీయంగా చైతన్యం కావాలి
● ఐక్యతతో అభివృద్ధి సాధించాలి
● మెదక్ ఎంపీ రఘునందన్
7

నిజాయితీ చాటుకున్న
ఆర్టీసీ సిబ్బంది
● బస్సులో బ్యాగ్ మర్చిపోయిన ప్రయాణికుడు
● భద్రంగా అప్పగింత..
● అభినందించిన హుస్నాబాద్ డీఎం
7

160 కిలోల నకిలీ పత్తి
విత్తనాలు స్వాధీనం
7

యమపాశాలు!

● ప్రమాదకరంగా తీగలు, స్తంభాలు ● ఏడాదిలో 44 మంది ప్రాణాలు హరీ

● 77 పశువులు మృత్యువాత
● ఫిర్యాదులు అందుతున్నా చర్యలు జాప్యం
● సాంకేతికత పెరిగినా మారని పరిస్థితులు
● విద్యుత్ అధికారులు, సిబ్బందిపై విమర్శలు

ఆంధ్రజ్యోతి ఫోకస్

" చిన్నకోడూరు శివారులోని చెరుకు ఎల్లయ్య అనే కౌలు రైతు పొలం సాగుచేస్తున్నాడు. పెద్దకోడూరు సబ్‌స్టేషన్ నుంచి చిన్నకోడూరు ట్రాన్స్‌ఫార్మర్‌కు వచ్చే లైను చెట్లకొమ్మలను తాకుతూ మంటలు చెలరేగుతున్నాయి. ఇదే రైతు పొలంలో ఆరునెలల క్రితం విద్యుత్ స్తంభం వంగిపోయి ప్రమాదకరంగా మారింది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వ్యవసాయం చేయాల్సి వస్తుందని కౌలు రైతు ఎల్లయ్య వాపోతున్నాడు."

"సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లిలో విద్యుత్ తీగలు ట్రాక్టర్లకు, హార్వెస్టర్‌కు తగులుతున్నాయి. ఈ విషయంపై ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు చెబుతున్నారు. ఇర్కోడ్‌లో ఇళ్ల పైనుంచే ప్రమాదకరంగా విద్యుత్ తీగలు ఉన్నా సరిచేయడం లేదు. ఇదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రహరీ లోపల ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు ఉండడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు".

\- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూన్ 16


మద్దూరులో బంటు చంద్రయ్య అనే రైతు భూమిలో విద్యుత్ తీగలపైనే ఆధారపడిన స్తంభం


సిద్దిపేట అర్బన్ మండలం కిష్టసాగర్‌లో ధర్మయ్య పొలంలో విద్యుత్ వైర్ల పరిస్థితి

అప్రమత్తంగా ఉండాల్సిన విద్యుత్ శాఖలో అలసత్వం ఆవహించింది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడడంతో పుట్టెడు సమస్యలు దాపురించాయి. ఎప్పటికప్పుడు విద్యుత్ తీగలను, స్తంభాలను సరిచేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా నిండు ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. నియంత్రణ చర్యలు చేపట్టడంలోనూ నిర్లక్ష్యమే కనిపిస్తోంది. ఉన్నతాధికారులు సూచిస్తున్నప్పటికీ కిందిస్థాయిలో మాత్రం ఆ దిశగా అడుగులు వేయడం లేదు. వర్షాకాలంలో ప్రమాదల తీవ్రత పెరిగే అవకాశాలున్నందున విద్యుత్ శాఖ లోటుపాట్లపై సోమవారం 'ఆంధ్రజ్యోతి' పరిశీలన చేసింది.

కర్రలే ఊతంగా..

జిల్లాలో పలుచోట్లా ఎప్పుడు విరిగిపడతాయో నన్న స్థాయిలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. ఇక స్తంభాలను అమర్చకపోవడంతో రైతులే కర్రలను ఊతంగా పెట్టి తీగలను విస్తరించడం మరింత ప్రమాదకరంగా మారిందనే చెప్పాలి.


చేర్యాలలోని రేణుకా గార్డెన్ సమీపంలో కర్రలను ఊతంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు

మిగతా 8వ పేజీలో


వేలం పాట నిర్వహిస్తున్న ఆలయాధికారులు

మల్లన్న ఆలయంలో వేలం పాట

చేర్యాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం ఈవో అన్నపూర్ణ ఆధ్వర్యంలో సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం పాట నిర్వహించారు. భక్తులు మొక్కుబడులుగా సమర్పించిన కొబ్బరి ముక్కల సేకరణను కురవికి చెందిన యుగేందర్ రూ.71,77,777కు హెచ్చుపాటపాడి టెండర్ దక్కించుకున్నాడు. కొమురవెల్లికి చెందిన ఉప్పల వంశీకృష్ణ రూ.70.56 లక్షలకు వస్త్రాలు, ఒడిబియ్యం, పసుపు సేకరణ, కడెం సిద్దులు లీటరు పాలు ధర రూ.78, పెరుగు కిలో రూ.60 చొప్పున సరఫరా, ఆలయ ప్రాంగణంలో వెండి కోరమీసాలు, మొక్కుబడి వస్త్రాల విక్రయ హక్కును ఎక్కలదేవి అరుణ రూ.16.61లక్షలకు, హైదరాబాద్‌కు చెందిన మిత్రా ఎంటర్ ప్రైజస్ రూ.4.71 లక్షలకు టాయిలెట్ బ్లాక్ లీజు, ఫొటోలు వీడియోను మల్లం నవీన్ రూ.15,740కు హెచ్చుపాట పాడి టెండర్ దక్కించుకున్నారు. ఈ సారి కొబ్బరిముక్కల సేకరణకు రూ.32 లక్షలు, కోరమీసాల విక్రయం ద్వారా రూ.36వేలు, వస్త్రాలు, ఒడిబియ్యం సేకరణ ద్వారా రూ.11.40లక్షల మేర అదనపు ఆదాయం సమకూరనుంది. కొబ్బరికాయల విక్రయం, ఎల్లమ్మ ఆలయ ఆవరణలో కూల్‌డ్రింక్స్ విక్రయం వాయిదా వేశారు. ప్రసాదాల తయారీ, పూలు, పూలదండల సరఫరా, బుక్ ప్రింటింగ్‌కు సరైన పాట రాకపోవడంతో వాయిదా వేశారు. వాయిదా పడిన వాటిని త్వరలో టెండర్లు నిర్వహించనున్నట్లు ఈవో అన్నపూర్ణ తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో బుద్ది శ్రీనివాస్, ధర్మకర్తలు జయప్రకాశ్, లింగంపల్లి శ్రీనివాస్, కాయిత మోహన్‌రెడ్డి, అంజిరెడ్డి, సూపరింటెండెంట్ శ్రీరాములు, ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్ పాల్గొన్నారు.


చిన్నకోడూరు ఉన్నత పాఠశాలలో తన కూతురు సమీక్షను చేర్పిస్తున్న ఉపాధ్యాయుడు తిరుపతిరెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి.. ఇతరులకు ఆదర్శంగా నిలిచి

● తమ పిల్లలను సర్కారు బడుల్లో చదివిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు

చిన్నకోడూరు/జగదేవ్‌పూర్, జూన్16(ఆంధ్రజ్యోతి): వారు ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను కూడా సర్కారు పాఠశాలల్లో చేర్పించి ఆదర్శంగా నిలిచారు.

చిన్నకోడూరు మండలం చండ్లాపూర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు అనుపాటి తిరుపతిరెడ్డి చిన్నకోడూరు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. తన పెద్దకూతురు సమీక్షను సోమవారం చిన్నకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతిలో చేర్పించాడు. తన రెండో కూతురు క్రిషిక కూడా ప్రస్తుతం తాను పనిచేస్తున్న పాఠశాలలోనే ఒకటో తరగతి చదువుతుందని తెలిపారు. ఈ సందర్భంగా చిన్నకోడూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య తిరుపతిరెడ్డిని అభినందించారు.

జగదేవ్‌పూర్ మండలం వట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా రవిరాజు ఉత్తమ్ పనిచేస్తున్నారు. తను చదువు చెబుతున్న పాఠశాలలోనే సోమవారం తన కుమారుడు శర్వాన్ష రాజును 8వ తరగతిలో, తన కూతురు శర్వాణిని జగదేవ్‌పూర్‌లోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో చేర్పించి శబాష్ అనిపించుకున్నారు.ప్రధానోపాధ్యాయులు సరోజ హిందీ ఉపాధ్యాయుడు రవిరాజును అభినందించారు. ఇతర ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.


జగదేవ్‌పూర్ మండలం వట్టిపల్లి పాఠశాలలో తన కుమారుడిని చేర్పించిన హిందీ ఉపాధ్యాయుడు రవిరాజు


పరీక్ష రాస్తున్న విద్యార్థులు



పాఠశాల గేట్‌కు నో అడ్మిషన్ బోర్డు పెట్టిన దృశ్యం

నో అడ్మిషన్..

● ఇందిరానగర్ జడ్పీ హైస్కూల్‌లో అడ్మిషన్లు ఫుల్
● 6వ తరగతి ప్రవేశ పరీక్షకు విశేష స్పందన

సిద్దిపేట కల్చరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ జడ్పీ హైస్కూల్‌లో 6వ తరగతి కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు విశేష స్పందన వచ్చింది. 200 సీట్లకు గాను కాంప్లెక్స్ పరిధిలోని 120 సీట్లు మినహాయించి మిగిలిన 80 సీట్ల కోసం దాదాపు 300 మంది పోటీ పడ్డారు. ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా ఇందిరాగర్ ప్రభుత్వ పాఠశాలలో చేరేందుకు చాలామంది ఆసక్తి కనబరిచారు. అడ్మిషన్ పొందేందుకు గూగుల్ క్యూఆర్ కోడ్ ద్వారా విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అలా దరఖాస్తు చేసుకున్న వారికి పాఠశాల ఆవరణలో సోమవారం పరీక్ష నిర్వహించారు. అర్బన్ ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజప్రభాకర్‌రెడ్డి ప్రశ్నపత్రంను విడుదల చేశారు. రెండు రోజుల్లో ఫలితాలు విద్యార్థుల తల్లిదండ్రుల మొబైల్ ద్వారా సమాచారం అందుతుందని తెలిపారు


పరీక్ష రాస్తున్న పిల్లల కోసం వేచి ఉన్న తల్లిదండ్రులు

ప్రైమరీకి పెరిగిన తాకిడి

ఇందిరానగర్ జడ్పీ హైస్కూల్‌లో అడ్మిషన్ దొరకడం కష్టమని భావించిన కొందరు ముందుగా ప్రైమరీలో అడ్మిట్ చేస్తున్నారు. 5వ తరగతి వరకు ఇందిరానగర్ చెందిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదివితే (కాంప్లెక్స్ పరిధి) డైరెక్ట్‌గా ఉన్నత పాఠశాలలో సీట్ ఉంటుందని భావిస్తున్నారు. ఈ క్రమంలో ప్రైమరీలో 5వ తరగతికి అడ్మిషన్ల తాకిడి పెరిగింది. ప్రస్తుతం 5వ తరగతిలో 110 మంది విద్యార్థులు అడ్మిషన్ తీసుకున్నారు. ఇప్పటికే రెండు సెక్షన్లు చేసి విద్యార్థులను సర్దుబాటు చేస్తున్నారు.

కలెక్టర్ కా హుకూం

● ప్రజావాణికి అధికారులంతా రావాల్సిందే
● ఉన్నతాధికారుల గైర్హాజరుపై అసహనం
● ప్రతీ సోమవారం సెలవులు రద్దు
● జిల్లా బాస్ ఆదేశం

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూన్ 16 : ఇన్ని రోజులు ఒక లెక్క, ఇక నుంచి ఒక లెక్క అంటూ, ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఆయా శాఖల ఉన్నతాధికారులు రావాల్సిందేనంటూ జిల్లా నూతన కలెక్టర్ హైమావతి హుకూం జారీ చేశారు. సోమవారం సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణిలో భాగంగా జిల్లా నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి జిల్లా అదనపు కలెక్టర్లు గరీమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్‌తో కలిసి కలెక్టర్ హైమావతి దరఖాస్తులను స్వీకరించారు. 98 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ప్రజావాణి కార్యక్రమానికి ఆయా శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు కాకుండా కింది స్థాయి సిబ్బంది రావడంపై కలెక్టర్ హైమావతి అసహనం వ్యక్తం చేశారు. వచ్చే ప్రజావాణి కార్యక్రమానికి ఆయా శాఖలకు చెందిన ఉన్నతాధికారులు రావాలని, ప్రజావాణి కార్యక్రమానికి ముందు ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు సమీక్ష నిర్వహిస్తానని ఆమె వెల్లడించారు. ప్రజావాణి కార్యక్రమం ఉన్న రోజున అధికారుల సెలవులను రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రజావాణిలో అర్జీదారుల సమస్యలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై అధికారులను అడిగి ఆరా తీశారు. పూర్తి వివరాలతో మంగళవారం నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. మొత్తానికి కలెక్టర్ హైమవతి ఇచ్చిన ఆదేశాలను అధికారులు పాటిస్తారా లేదా దాటవేస్తారా అని వచ్చే ప్రజావాణిలో చూద్దామని పలువురు చర్చించుకున్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

జిల్లా అభివృద్ధికి అందరం కలిసి పనిచేయాలి

సిద్దిపేట జిల్లా అభివృద్ధికి అందరం కలిసికట్టుగా పనిచేయాలని కలెక్టర్ హైమామతి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె అధికారులతో మాట్లాడారు. ప్రజావాణి దరఖాస్తులను ఆయా శాఖలకు పంపించి, వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. అత్యవసర పరిస్థితి ఉంటే మాత్రమే ప్రజావాణి రోజు జిల్లా అధికారులకు సెలవు మంజూరు చేస్తానని, జిల్లా అధికారులు తప్పకుండా తన అనుమతి లేకుండా సెలవు పెట్టరాదని ఆదేశించారు. జిల్లాలో ఆయా శాఖలపై, ప్రభుత్వ కార్యక్రమాల ప్రగతిపై ప్రతినెల 2 సార్లు చొప్పున 15 రోజులకొకసారి సమీక్ష నిర్వహిస్తానని, ఆయా శాఖలకు సంబంధించిన జిల్లా స్థాయి నుండి మండల స్థాయి అధికారులు అందరూ ఆ సమీక్షలో పూర్తి నివేదికలతో హాజరుకావాలని సూచించారు. ఈనెల 21న సిద్దిపేటలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో జిల్లా అధికారులందరూ పాల్గొనాలని ఆదేశించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల సాకారం

పీసీసీ కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి

శివ్వంపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హయాంలో ఒక్క నిరుపేద కుటుంబానికి ఇల్లు ఇవ్వలేదని, మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు సొంత ఇంటి కల నెరవేరుతుందని పీసీసీ కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కొత్తపేట రుప్లా పంచాయతీ తండా పరిధిలోని పాండ్యా, పోతిరెడ్డిపల్లి, రూప్లా తండాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాపాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇచ్చిన 6 గ్యారంటీలో భాగంగా పార్టీలకు అతీతంగా ఇల్లు లేని గుడిసెలో నివసిస్తున్న నిజమైన లబ్ధిదారులకు ఇద్దరమ్మ ఇల్లు మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నవీన్ గుప్తా, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేతనైనంత కాలం పనిచేస్తూనే..

ఆరు పదుల వయసులోనూ ఆత్మగౌరవంతో జీవనం

ఆదర్శంగా నిలుస్తున్న వృద్ధులు

గుమ్మడిదల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : వయసు 60 దాటినా, ఎవరిపైనా ఆధారపడకుండా, తమ శక్తి మేరకు పనిచేస్తూ జీవన పోరాటం కొనసాగిస్తున్నారు కొందరు వృద్ధులు. సంగారెడ్డి జిల్లాలోని బొంతపల్లి, గుమ్మడిదల రోడ్డుపై చిరు వ్యాపారం చేసుకుంటున్న వృద్ధులు అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. 'చేతనైనంత కాలం పని చేయాలి. వయసు 60 దాటినంత మాత్రాన బాధపడాల్సిన పనేముంది? ఎవరిపైనా ఆధారపడకుండా బతకాలి' అని ఈ వృద్ధులు చెబుతున్నారు. బతుకు విలువను నేర్పుతున్నారు. కష్టేఫలి అన్న సూత్రాన్ని ఆచరణలో చూపిస్తున్నారు.



జీవన పోరాటంలో పెద్దబాపులు

● గుమ్మడిదలకు చెందిన అప్పారావు(62), తన భార్యతో కలిసి వాడవాడలా పల్లీలు అమ్ముకుంటూ జీవిస్తున్నాడు. 'బ్రతకాలంటే ఏదో ఒక పని చేసుకోవాలి, అప్పుడే పూట గడుస్తుంది' అని ఆయన అంటున్నారు. రోజుకు రూ.200 మిగులుతుందని, దాంతో భార్యాభర్తలు సంతోషంగా జీవిస్తున్నారని తెలిపారు.

● గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామానికి చెందిన సదానంద్ 40 ఏళ్లుగా ప్రధాన కూడలి వద్ద చిన్న బండిపై అరటిపండ్లతో పాటు సీజనల్ పండ్లను అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎండ, వాన, చలి ఏదైనా తన వ్యాపారాన్ని ఆపలేదు. రోజువారీ ఆదాయంతో పిల్లల చదువులు, ఇంటి ఖర్చులు చూసుకుంటున్నారు. 'చేసే పని చిన్నదా, పెద్దదా అని చూడకుండా, ప్రతి ఒక్కరూ మంచి పని చేసుకోవాలి' అని ఆయన సూచిస్తున్నారు.


బొంతపల్లిలో బండిపై అరటి పండ్లు అమ్ముకుంటున్న చిరు వ్యాపారి సదానంద్



స్వశక్తితో బతుకుతున్న పెద్దమ్మలు

● గుమ్మడిదల గ్రామానికి చెందిన గంగుల విట్టమ్మ (64) పదేళ్లుగా రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. భర్త చనిపోయినా అధైర్యపడకుండా, ఒంటరిగా ఉంటూ స్వశక్తితో బతుకుతున్నారు. రోజుకు రూ. 300 నుంచి 400 వరకు ఆదాయం వస్తుందని, వచ్చిన దాంట్లోనే తృప్తిగా బతుకుతున్నామని తెలిపారు. 'పనిచేయకుండానే డబ్బులు రావాలని ఆశపడుతూ అడ్డదారులు తొక్కుతున్న యువతను చూస్తే బాధ అనిపిస్తుంది' అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

● గుమ్మడిదలలో నివాసముంటున్న యశోద (61), తన భర్తతో కలిసి వివిధ రకాల కూరగాయల వ్యాపారం చేస్తూ జీవనం గడుపుతున్నారు. వీరికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నా, చిరు వ్యాపారం ద్వారా వచ్చిన ఆదాయంతోనే వారి పెళ్లిళ్లు చేశారు. సొంత ఇల్లు, భూములు లేకపోయినా, తమ కాళ్ల మీద తాము నిలబడి జీవితాన్ని సాగిస్తున్నారు. రోజుకు రూ.300 వరకు ఆదాయం పొందుతున్నామని, చిన్నచిన్న సమస్యలకే ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దని ఆమె సూచిస్తున్నారు.



సమీక్షా సమావేశాలకు నివేదికలు సిద్ధం చేసుకోండి

● అధికారులు పూర్తి సమాచారంతో అందుబాటులో ఉండాలి

● సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య ఆదేశం

సంగారెడ్డి రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): శాఖల వారీగా నిర్వహించే సమీక్ష సమావేశాలకు అధికారులు పూర్తి సమాచారంతో నివేదికలు సిద్ధం చేసుకోవాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తన వద్దకు వచ్చే ప్రతీ ఫైల్‌కు పూర్తి వివరాలు జత చేయాలని, ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే సమాచారం అందించాలన్నారు. తాను ఫోన్‌లో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఆయా శాఖల్లో ఉన్న పెండింగ్ ఫైళ్లను వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. త్వరలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నామని, ఆ సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో రావాలని ఆదేశించారు. జిల్లాలో పర్యటనలకు వెళ్లినప్పుడు ఆయా ప్రాంతాలకు సంబంధించిన పూర్తి సమాచారం వెంట అందుబాటులో ఉంచుకోవాలని, ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే అధికారులు తక్షణమే స్పందించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో పద్మజా రాణి, జిల్లా యువజన, క్రీడా శాఖాధికారి ఖాసీం బేగ్, ఇతర వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలు..

తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ స్కూళ్లలో 4వ తరగతి ప్రవేశాలకు బాలబాలికల ఎంపిక ప్రక్రియ జరుగనున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. సోమవారం ఆమె స్పోర్ట్స్ స్కూల్ సెలెక్షన్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం వివరాలను వెల్లడించారు. హకీంపేట, కరీంనగర్, అదిలాబాద్‌లోని స్పోర్ట్స్ స్కూళ్లలో బాలబాలికలకు 20 చొప్పున మొత్తం 120 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 19 వరకు మండల స్థాయి ఎంపికల షెడ్యూల్ జరుగుతుందని, ఆ తర్వాత జిల్లా స్థాయి ఎంపికలు జూన్ 25, 26 తేదీల్లో సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో ప్రారంభమవుతాయని కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. పూర్తి సమాచారం కోసం 7981798957 నంబర్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

'ప్రజావాణి'పై నిర్లక్ష్యం వద్దు

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించరాదని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి ప్రజలు, అర్జీదారులు హాజరయ్యారు. కలెక్టర్ ప్రజల నుంచి మొత్తం 85 వినతులు స్వీకరించారు, ఇందులో 36 భూ సమస్యలు, 17 ఇందిరమ్మ ఇళ్లు, 2 పింఛన్లు, 17 ఇతర సమస్యలకు సంబంధించినవి ఉన్నాయి. దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, అలాగే మండల స్థాయిలో ప్రతీ సోమవారం ప్రజావాణి నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఇదేవిధంగా, పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన ఎస్పీ, బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఫోన్‌లో ఆదేశించారు.


అర్జీదారుల సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్

మెదక్‌లో పీఎం ధర్తీ ఆబాజన్ భాగీదారి అభియాన్

మెదక్ జిల్లాలోని 10 మండలాలు, 15 గిరిజన గ్రామాలు, 17 హ్యాబిటేషన్లలో పీఎం ధర్తీ ఆబాజన్ భాగీదారి అభియాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆధార్, రేషన్ కార్డు, కుల సర్టిఫికెట్, కిసాన్ క్రెడిట్ కార్డు, ఆయుష్మాన్ భవ ఇన్సూరెన్స్ వంటి సేవల కోసం వినతులు స్వీకరించనున్నామని తెలిపారు. అధికారులు సమన్వయంతో ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు.

కామ్రేడ్ కిష్టన్న.. బాగున్నారా?

● వయోవృద్ధ సీపీఐ కార్యకర్తను ఆప్యాయంగా పలకరించిన మెదక్ అదనపు కలెక్టర్ నగేష్



మెదక్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : 'ఏం కిష్టన్న... బాగున్నారా... ఆరోగ్యం కులాసాగా ఉందా... ఉద్యమాలు కొనసాగిస్తున్నారా... ఏంటి సమస్య?' అంటూ మెదక్ అదనపు కలెక్టర్ నగేష్, సీపీఐ సీనియర్ కార్యకర్త, వయోవృద్ధులు కామ్రేడ్ మరాఠీ కిష్టయ్యను ఆప్యాయంగా పలకరించారు. సోమవారం ప్రజావాణి హాలులో వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన కిష్టయ్యను చూసి గుర్తించిన నగేష్, ఆయన బాగోగులు కనుక్కున్నారు. భోజనం చేసుకుని భోజనానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. గతంలో మెదక్ ఆర్డీవోగా పనిచేసిన నగేష్‌కు, పీడిత ప్రజల తరఫున మెమొరాండాలు ఇవ్వడానికి కిష్టయ్య తరచుగా కార్యాలయానికి వచ్చేవారు. ప్రస్తుతం 90 ఏళ్లపైబడిన వయసులోనూ పలువురి తరఫున ఫిర్యాదులు ఇవ్వడానికి కిష్టయ్య స్వయంగా ప్రజావాణికి వచ్చారు.

ట్రాక్టర్, బైక్ ఢీకొని ఒకరి మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు


చంద్రయ్య (ఫైల్)

చేగుంట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన చేగుంట మండల పరిధిలోని పులిమామిడి గ్రామ శివారులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామానికి చెందిన గుండెల్లి చంద్రయ్య (50) తన కొడుకు పరుశరాములుతో కలిసి రామాయంపేట మండలం ధర్మారంలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లి బైక్‌పై తిరిగి స్వగ్రామం కాసులాబాద్‌కు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ట్రాక్టర్ ఢీకొనడంతో చంద్రయ్య తల పగిలి అక్కడికక్కడే మృతి చెందారు. కొడుకు పరుశరాములు కుడి కాలికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న చేగుంట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

తిమ్మాపూర్ శివారు రోడ్డు ప్రమాదంలో ఇద్దరు..

దుబ్బాక, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులో ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం, అక్బర్‌పేట - భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి గ్రామానికి చెందిన పల్లె అనిల్ (27), అదే గ్రామానికి చెందిన ఉచ్చురి పాపయ్య (30) బైక్‌పై సిద్దిపేటకు వెళ్తుండగా, సిద్దిపేట నుంచి రామాయంపేట వైపు వెళ్తున్న కారు వారి బైక్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో పల్లె అనిల్ అక్కడికక్కడే మృతి చెందారు. గాయాలైన పాపయ్యను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పాపయ్య సోమవారం ఉదయం మరణించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దుబ్బాక ఎస్ఐ గంగరాజు .

తల్లిగారింటికి వెళ్తానన్న వివాహిత అదృశ్యం

● నర్సాపూర్‌లో మిస్సింగ్ కేసు నమోదు

నర్సాపూర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తన తల్లిగారింటికి వెళ్తానని భర్తకు చెప్పి ఇంటి నుంచి వెళ్లిన వివాహిత అదృశ్యమైన సంగటన నర్సాపూర్ మండల పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రుస్తుంపేటకు చెందిన పద్మకు ఆరేళ్ల క్రితం నర్సాపూర్‌కు చెందిన ఖాజీపల్లి నర్సింలుతో వివాహం జరిగింది. వారికి పిల్లలు లేరు. పద్మ ఈ నెల 15వ తేదీ ఆదివారం తన తల్లిగారి ఇంటికి రుస్తుంపేటకు వెళ్తానని భర్తకు చెప్పి వెళ్లింది. అయితే, సాయంత్రం తల్లిగారింటికి వెళ్లిన భార్యకు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. రుస్తుంపేటలోని బావమరిదికి ఫోన్ చేయగా తమ వద్దకు రాలేదని సమాధానమిచ్చారు. నర్సాపూర్‌తో పాటు బంధువుల వద్ద, ఇతర చోట్ల ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో, సోమవారం నర్సింలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ప్రభుత్వ వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకే విచారణలు

● నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


నారాయణఖేడ్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న తీవ్ర వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ అగ్ర నాయకులపై విచారణ పేరిట కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి విమర్శించారు. ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో సోమవారం బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ విచారణ సందర్భంగా, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన హైదరాబాద్‌కు తరలి వెళ్లారు. మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి కేటీఆర్‌ను కలిసి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, నర్సింహారెడ్డి, మాజీ ఎంపీపీలు జంగం శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, నాయకులు జగదీశ్వర్‌చారి, నగేష్, మశ్చందర్, గీతారెడ్డి, మాధవరెడ్డి, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 20న బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 35 ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
GLOBAL CINEMAS RELEASE

SUPER HIT నేడే చూడండి



సంధ్య 70ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
8.00,11.00,2.00,6.00,9.00



దేవి 70 - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.15,6.00,9.15
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
ఆరాధన 70ఎంఎం - తార్నాక 11.00,2.00,6.00,9.00
MG MOVIES 9989522999



సుదర్శన్ 35 - ఆర్.టి.సి. క్రాస్‌రోడ్స్ 11.00,2.15,6.00,9.15
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
లక్ష్మీకళ - మూసాపేట్ 11.15,2.40,6.20

మోడల్ స్కూల్‌కు
ఆర్టీసీ బస్సు నడపాలి

● నర్సాపూర్ బస్టాండ్ వద్ద తల్లిదండ్రులు, విద్యార్థుల ధర్నా


నర్సాపూర్‌లో బస్టాండు వద్ద బైఠాయించిన విద్యార్థులు, తల్లిదండ్రులు

నర్సాపూర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కపల్లిలో ఉన్న మోడల్ స్కూల్‌కు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సోమవారం నర్సాపూర్ బస్టాండు ఎదుట జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. పాఠశాలలు ప్రారంభమైనా ఆర్టీసీ అధికారులు మాత్రం స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడల్ స్కూల్‌కు గతంలో రోజు మూడు బస్సులు నడిపేవారని, ఈసారి నడపడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులు లేకపోవడంతో స్కూల్‌కు వెళ్లడానికి పడరాని పాట్లు పడాల్సి వస్తోందని విద్యార్థులు వాపోయారు. పోలీసులు అక్కడకు వచ్చి నచ్చచెప్పేందుకు ప్రయత్నించినా ఎంతకు విరమించకపోవడంతో ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. ఆర్టీసీ బస్సులను ఈ నెల 20 నుంచి నడుపుతామని డిపో అధికారులు తెలిపగా, వెంటనే ప్రారంభించాలని తల్లిదండ్రులు, విద్యార్థులు డిమాండ్ చేశారు. చివరకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

● ప్రజా సంఘాల డిమాండ్


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పౌర హక్కుల, ప్రజాసంఘాల నాయకులు

సిద్దిపేట అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులు, అమాయక ఆదివాసీలను అణచివేసే యుద్ధాన్ని ఆపి, కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని జిల్లా పౌరహక్కుల సంఘం, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జూన్ 17న హైదరాబాద్‌లో జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం సిద్దిపేటలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు రాగుల భూపతి మాట్లాడుతూ దండకారణ్య ప్రాంతంలో స్థానిక సాయిధ పోలీసులతో పాటు కేంద్ర పారామిలిటరీ సాయిధ బలగాలతో కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహించి యుద్ధ వాతావరణం సృష్టిస్తున్నారని, అమాయక ఆదివాసీలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీల మీద, మావోయిస్టు పార్టీ నాయకుల మీద జరిగే దాడులను ఆపి, ఆపరేషన్ కగార్ పేరుతో జరిగే కాల్పులను నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రజా ఫ్రంట్ నాయకులు జి. సత్తయ్య, దారం మల్లారెడ్డి, దుర్గం రాములు, సి.హెచ్. నరసింహులు, మధుసూదన్‌రెడ్డి, టి. మల్లేశ, నర్సింలు, పి. శ్రీధర్, నర్సింలు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట జ్యోతిషుడు
రాజేశ్వర్‌రెడ్డికి దైవజ్ఞ రత్న బిరుదు

● స్వర్ణ కంకణం ప్రదానం


రాజేశ్వర్‌రెడ్డిని సత్కరిస్తున్న విశ్వజ్యోతి సంస్థ సభ్యులు

సిద్దిపేట క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటకు చెందిన ప్రముఖ జ్యోతిషుడు డాక్టర్ కలకుంట్ల రాజేశ్వర్‌రెడ్డికి అరుదైన గౌరవం లభించింది. హైదరాబాద్‌లో ఆదివారం సాయంత్రం విశ్వజ్యోతి జ్యోతిష విజ్ఞాన సంస్థ నిర్వహించిన 17వ జ్యోతిష సమ్మేళనంలో ఆయనకు దైవజ్ఞ రత్న బిరుదుతో పాటు స్వర్ణ కంకణం ప్రదానం చేశారు. ముహూర్తం, లగ్న, భావ, నవాంశ ఫలితాలపై, అలాగే బృహత్సంహితపై జరిగిన సెమినార్‌లో ప్రతిభావంతులను గుర్తించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, బహుగ్రంథకర్త పుచ్చా శ్రీనివాసరావు, పరిశోధకులు పాలకుర్తి శ్రీకాంత్ శర్మ, ఇంద్రగంటి వెంకట గోపాలకృష్ణ శర్మ, కంచి కామకోటి పీఠం ఆస్థాన సిద్ధాంతి లక్కావఝుల విజయ సుబ్రహ్మణ్య సిద్ధాంతి, విశ్రాంత ఇస్రో డైరెక్టర్ డా. రావు తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా
బాలకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నిక

● రెండోసారి ఎన్నికైన తూప్రాన్ అల్లాపూర్ వాసి


రాష్ట్ర అధ్యక్షుడిగా నియామక పత్రం అందుకుంటున్న బాలకృష్ణ ప్రజాపతి

తూప్రాన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధిలోని అల్లాపూర్‌కు చెందిన కుమ్మరి బాలకృష్ణ ప్రజాపతి తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సాయంత్రం జరిగిన ఎన్నికల్లో బాలకృష్ణ రెండోసారి ఈ పదవికి ఎంపికయ్యారు. రాత్రి జరిగిన కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు కానుగుల నర్సింలు ప్రజాపతి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మరి బాలకృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలోని కుమ్మరుల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

160 కిలోల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం

బెజ్జంకి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ముగ్గురిని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 160 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. సిదిపేట టాస్క్‌ఫోర్స్ ఏపీసీ రవీందర్ సోమవారం కేసు వివరాలను వెల్లడించారు. నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు మండల కేంద్రంలోని ఎడ్లబండి చౌరస్తా వద్ద ఆదివారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా వేశారు. ఈ క్రమంలో మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం సర్వాయిపేటకు చెందిన దుర్గం శేఖర్‌ను అదుపులోకి తీసుకుని, అతని వద్ద నాలుగు కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. శేఖర్ ఇచ్చిన సమాచారం మేరకు బెజ్జంకి శివారులోని పాడుబడిన ప్రభుత్వ పట్టుపురుగుల కేంద్రం వద్ద తనిఖీలు చేపట్టగా, నాలుగు బస్తాల్లో 160 కిలోల నకిలీ పత్తి విత్తనాలు లభించాయి. ఈ కేసులో దుర్గం శేఖర్ సహా, కడప జిల్లా మైదుకూరుకు చెందిన వసంతరాంరెడ్డి, నంద్యాల జిల్లా కొండపల్లికి చెందిన కుందవరం ప్రభాకర్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపించారు. మండల వ్యవసాయాధికారి సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆయన వెంట సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు రమేష్, జానకీరాం రెడ్డి, సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, బెజ్జంకి ఎస్సై తిరుపతి రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

మెదక్ బస్టాండులో ప్రయాణికుల రద్దీ





నిఘాపై నిర్లక్ష్యం

● మెదక్ ఆర్టీసీ బస్టాండుల్లో భద్రత కరువు
● నిత్యం వేలాది మంది ప్రయాణికులతో రద్దీ
● సీసీ కెమెరాలు లేకపోవటంపై సర్వత్రా విమర్శలు

మెదక్ అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : నిత్యం వేలాది మంది ప్రయాణికులతో రద్దీగా ఉండే మెదక్ ఆర్టీసీ బస్టాండ్‌లో నిఘా కరువైంది. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించినా, అధికారులు పట్టించుకోవడం లేదు. ఇది వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. దిన దినాభివృద్ధి చెందుతున్న మెదక్‌లో పోలీసులు రద్దీగా ఉండే ఇతర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా, జిల్లా కేంద్రంలోని అన్ని ప్రాంతాల కన్నా ఎక్కువగా రద్దీ ఉండే ఆర్టీసీ బస్టాండ్‌లో మాత్రం ఇప్పటి వరకు ఒక్క సీసీ కెమెరా కూడా బిగించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

భద్రత లోపం

ప్రతిరోజూ వేల సంఖ్యలో ప్రయాణికులు, విద్యార్థులు వచ్చే ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ కెమెరాలు లేకపోవడం వల్ల భద్రత లోపించింది. వేలాది మందితో కిటకిటలాడే బస్టాండ్‌లో ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే పోలీసులకు డిపో ఆవరణ నుంచి ఎలాంటి ఆధారాలు దొరకని పరిస్థితి నెలకొంది. సెక్యూరిటీ గార్డులు కేవలం బస్‌డిపో వరకు మాత్రమే తమ విధులు నిర్వహిస్తుండగా, ప్రాంగణంలోకి ఎవరు వస్తున్నారు, ఎలాంటి కార్యకలాపాలు జరుగుతున్నాయో పట్టించుకోవడం లేదు. కొత్తగా పట్టణంలోకి వచ్చే వారిపై నిఘా పెట్టాల్సిన కీలక ప్రాంతంలో కెమెరాలు లేకపోవడంపై ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మెదక్ డిపో వివరాలు

మెదక్ డిపో పరిధిలో మొత్తం 108 బస్సులు (ఆర్టీసీ 53, అద్దె బస్సులు 55) ఉన్నాయి. నిత్యం 30 వేల కిలో మీటర్ల ప్రయాణిం చేస్తూ..60 వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతోంది. వీటి ద్వారా రూ. 20 లక్షల ఆదాయం సంస్థకు సమకూరుతోంది. ఇందులో 60 వేల మంది ప్రయాణికుల్లో 44 వేల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేస్తుండటం గమనార్హం. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ కెమెరాల ఏర్పాటును విస్మరించడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బస్టాండ్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి



రోజూ వేలాది మంది రాకపోకలు కొనసాగించే బస్టాండులో సీసీ కెమెరాలు లేకుంటే ఎట్లా? చిన్నచిన్న దుకాణాల్లో సైతం ఈ కాలంలో కెమెరాలు పెట్టుకుంటున్నారు. అపహరణలు, దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు జరిగినా సీసీలు ఫుటేజీలు నేడు ఉపయుక్తంగా ఉంటాయి. రద్దీగా ఉండే బస్టాండులో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి.

- సుంకరి లింగం, ప్రయాణికుడు

సీసీ కెమెరాల ఏర్పాటు.. సంస్థ నిబంధనల్లో ఉండదు



ఆర్టీసీ బస్టాండులో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రొవిజన్ ఉండదు. ఎక్కడా కూడా సంస్థ సీసీ కెమెరాలను సంస్థ ఏర్పాటు చేయలేదు. వీటిని ఏర్పాటు చేయాలని పట్టణ పోలీసులకు తెలిపాం. ఎవరైన దాతలు ముందుకు వచ్చినా, అందుకు ముందుగా ఉన్నతాధికారుల అనుమతి పొందాల్సి ఉంటుంది.

- సురేఖ, డీఎం మెదక్

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది

బస్సులో బ్యాగ్ మరచిపోయిన ప్రయాణికుడు
భద్రంగా అప్పగింత.. అభినందించిన హుస్నాబాద్ డీఎం


ప్రయాణికుడికి బ్యాగ్‌ను అప్పగిస్తున్న ఆర్టీసీ డీఎం, సిబ్బంది

హుస్నాబాద్‌రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : బస్సులో బ్యాగ్ మరిచిపోయిన ప్రయాణికుడికి బ్యాగ్‌ను అందజేసి హుస్నాబాద్ డిపో ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ చాటుకున్నారు. సోమవారం హుస్నాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హుజురాబాద్ నుంచి హుస్నాబాద్‌కు వస్తుండగా మార్గమధ్యలో కరీంనగర్ జిల్లా సైదాపూర్‌లో విజయ్ అనే ప్రయాణికుడు బ్యాగ్‌తో బస్సు ఎక్కాడు. ఆయన సెల్‌ఫోన్ మాట్లాడుతూ సుందరగిరిలో బస్సు దిగాడు. కొద్దిసేపటి తర్వాత బ్యాగ్‌ను మరిచిపోయినట్లు గుర్తించిన ప్రయాణికుడు విజయ్ వెంటనే బస్టాండ్ కంట్రోలర్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. కంట్రోలర్ వెంటనే సదరు బస్సు కండక్టర్‌ను అప్రమత్తం చేశారు. బస్‌లో ఉన్న బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని డిపో మేనేజర్‌కు వెంకన్నకు అందజేశారు. బ్యాగులో మొబైల్ ఫోన్, మూడు తులాల బంగారం నగలు, దుస్తులున్నాయి. బ్యాగ్‌ను ప్రయాణికుడు విజయ్‌కు అప్పగించడంతో ఆయన హర్షం వ్యక్తంచేశారు. ఆర్టీసీ సిబ్బందికి, డిపో మేనేజర్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. గతంలోనూ తాను నిర్మల్ బస్సులో సెల్‌ఫోన్ మరచిపోతే జగిత్యాల డిపోలో తిరిగి అందజేశారని విజయ్ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నాడు. ప్రయాణికుడికి సురక్షితంగా బ్యాగ్ అందించడంలో కండక్టర్ సాగర్, డ్రైవర్ ఆంజనేయులు, ట్రాఫిక్ సూపరింటెండెంట్ మురళి, కంట్రోలర్‌ను డిపో మేనేజర్ అభినందించారు.

బీసీని సీఎం చేసే దమ్ము
కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఉందా?

ముదిరాజ్‌లు రాజకీయంగా చైతన్యం కావాలి
ఐక్యతతో అభివృద్ధి సాధించాలి : మెదక్ ఎంపీ రఘునందన్

సిద్దిపేట అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు బీసీలను ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించే ధైర్యం ఉందా అని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. బీజేపీ చెప్పిన హామీలను నెరవేరుస్తుందని, రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆయన అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల సమీపంలోని ముదిరాజ్ హాస్టల్ భవనం ప్రహరీ నిర్మాణం కోసం రూ.20 లక్షల నిధులు మంజూరు చేసిన ఆయన, సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీజేపీకి అవకాశం వస్తే బీసీ బిడ్డను మూడుసార్లు దేశ ప్రధానిగా చేశామని, రాష్ట్రపతిగా మహిళను చేశామని గుర్తుచేశారు. ముదిరాజులు ఐక్యంగా అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. రాజకీయంగా చైతన్యం కావాలని సూచించారు. అందరూ ఆశీర్వదిస్తేనే మెదక్ ఎంపీగా గెలుపొందానని తప్పకుండా ఇక్కడి ప్రజలకు తన వంతుగా సహకరిస్తానని తెలిపారు. దుబ్బాక నియోజకవర్గంలో నాలుగు మండలాలకు ముదిరాజ్ కులస్తులనే అధ్యక్షులుగా ఎన్నుకున్నామని, బీజేపీ ముదిరాజులకు సముచిత స్థానం ఇచ్చిందని తెలిపారు. ప్రస్తుత బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా కూడా ముదిరాజ్‌నే నియమించుకున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరి శంకర్, ముదిరాజ్ పెద్దలు బాల్ రంగం, బీజేపీ నాయకులు బాసం గారి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మిరుదొడ్డి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పోస్టాఫీసు ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సూచించారు. సోమవారం మిరుదొడ్డిలో సబ్ పోస్టాఫీసును ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీలకు అతీతంగా ప్రజల అవసరాలను తీర్చడానికి ప్రజాప్రతినిధులు పనిచేయాలని, తాను అదే లక్ష్యంతో పని చేస్తున్నానని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా పనిచేసిన తొలినాళ్లలోనే మిరుదొడ్డిలో డబుల్ రోడ్డుతోపాటు, గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించామని గుర్తుచేశారు. అదేవిధంగా, మండలంలో రూ. 5 లక్షల ఎంపీ నిధులతో నిర్మించనున్న రెడ్డి సంఘం రీడింగ్ రూమ్ నిర్మాణానికి రఘునందన్‌రావు శంకుస్థాపన చేశారు. ఎస్సీ కమ్యూనిటీ భవనానికి అదనంగా రూ.5 లక్షల రూపాయలు కేటాయించి, పెండింగ్ పనులకు కొబ్బరికాయ కొట్టారు. ఈ కార్యక్రమంలో దిశ కమిటీ సభ్యుడు ప్రవీణ్, టెలికాం బోర్డు సభ్యుడు మల్లేశం, బీజేపీ మండల అధ్యక్షుడు అమర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ పరిహారంపై
అసైన్డ్ రైతుల ఆందోళన

● ఘనపూర్‌లో రెవెన్యూ సదస్సు వద్ద బైఠాయింపు
● రెండు నెలల్లో పరిష్కరిస్తామని ఆర్డీవో హామీ

తూప్రాన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): భూసేకరణ పరిహారం చెల్లింపులో పక్షపాతం వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ తూప్రాన్ మండలం ఘనపూర్ రెవెన్యూ సదస్సు వద్ద సోమవారం అసైన్డ్ రైతులు ఆందోళన చేపట్టారు. రెవెన్యూ సదస్సు ప్రారంభం కాగానే సర్వే నంబర్ 393, 441లో అసైన్డ్ పట్టాలు పొందిన మహిళా రైతులు అక్కడకు చేరుకున్నారు. పరిశ్రమల స్థాపన కోసం టీజీఐఐసీ ఈ భూములను సేకరిస్తున్నందున, తమకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పరిహారం చెల్లింపు విషయంలో వివక్ష చూపిస్తున్నారని ఆరోపిస్తూ రెవెన్యూ సదస్సు వద్ద రోడ్డుపై బైఠాయించి భూపంపిణీ సర్టిఫికెట్లు పట్టుకొని నిరసన తెలిపారు. ఆందోళనతో సదస్సులో గందరగోళం నెలకొంది. తూప్రాన్ ఎస్ఐ శివానందం, తహసీల్దార్ టిక్కాల్ శ్రీనివాస్ రైతులను సముదాయించారు. అనంతరం రైతులు ఆర్డీవో జయచంద్రారెడ్డి వద్దకు వెళ్లి సమస్యను విన్నవించారు. భూములకు పరిహారం చెల్లింపు విషయాన్ని రెండు నెలల్లో పరిష్కరిస్తానని ఆర్డీవో వారికి హామీ ఇచ్చారు.


ఘనపూర్ రెవెన్యూ సదస్సు వద్ద అసైన్డ్‌దారుల ఆందోళన

ఆటాడుకునేదెలా?

రాళ్లు, రప్పలతో నర్సాపూర్ జూనియర్ కళాశాల మైదానం
మినీ స్టేడియం నిర్మాణం హామీ ఏమైంది?


అధ్వానంగా మారిన జూనియర్ కాలేజీ మైదానం

నర్సాపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : గతంలో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో నర్సాపూర్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలు నిర్వహించిన ఘనత ఉన్నది. కానీ ప్రస్తుతం ఇక్కడి వారికి కనీసం ఆడుకోవడానికి కూడా మైదానం దిక్కులేదు. దీంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. మినీ స్టేడియం నిర్మిస్తామని ఎన్నికల సమయం వచ్చినపుడల్లా హామీలు ఇవ్వడమే తప్పా సంవత్సరాలు గడుస్తున్నా ఆచరణకు నోచుకోవడం లేదు. దీంతో జూనియర్ కాలేజీకి చెందిన మైదానమే ఇక్కడి వారికి ఆడుకోవడానికి దిక్కుగా మారింది. అది కూడా ఎవరు పట్టించుకోక అధ్వానంగా తయారైంది.

నిర్వహణలేక

ఈ మైదానంలోనే గతంలో జిల్లా, రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను కూడా నిర్వహించారు. వీటితో పాటు తరచూ క్రికెట్, షటిల్ తదితర పోటీలు కూడా కొనసాగుతాయి. ఇంతటి ప్రాముఖ్యం ఉన్న ఈ మైదానాన్ని నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో మైదానం అంతా ఎత్తుపల్లాలతో పాటు రాళ్లు రప్పలతో అత్యంత దారుణంగా మారింది. ఉన్న ఒక్క ఈ మైదానాన్ని క్రీడలకు అనువుగా తీర్చిదిద్దుదామన్న ఆలోచన ఇక్కడి నాయకులకు, అధికారులకు రావడం లేదని క్రీడాభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నిధులున్నా ప్రయోజనం లేదు

ఉమ్మడి రాష్ట్రంలో జూనియర్ కాలేజీ మైదానంలోనే మినీస్టేడియం నిర్మిస్తామని అప్పట్లో నిధులు కేటాయించి శంకుస్థాపన చేశారు. తర్వాత ఈ మైదానం మినీస్టేడియానికి స్థలం సరిపోదని మరోచోట ప్రత్యేకంగా కేటాయించి నిర్మిస్తామని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. అయితే, నర్సాపూర్‌లో స్థలం కేటాయిస్తే మినీస్టేడియం నిర్మాణానికి రూ.2కోట్లు గత ప్రభుత్వంలో మంజూరు కూడా అయ్యాయి. స్థలం కోసం నర్సాపూర్-మెదక్ రోడ్డు సమీపంలో పరిశీలించి, మళ్లీ దాని ఊసే ఎత్తలేదు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు మినీస్టేడియం నిర్మించాలని క్రీడాకారుల, క్రీడాభిమానులు కోరుకుంటున్నారు.

CHANGE OF NAME
★ I, Sreelakshmi P W/o Saleem Shaik born on 30-05-1981 residing at 1-112-1, Ashok Nagar Main Road, Near Masjid, Opp BHEL, Ramachandran, Sangareddy, Telangana, have changed my name to **Sanaha Shaik** vide affidavit dated 28-12-2024 at Nellore-AP AJH-10556

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

గాంధీచౌక్ వద్ద ట్రాఫిక్‌జాం


ప్రయాసపడుతున్న ప్రయాణికులు

చేర్యాల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని గాంధీచౌక్ వద్ద బ్రిడ్జి పనులు నత్తనడకన కొనసాగుతుండటంతో జనగావం-సిద్దిపేట జాతీయ రహదారిపై నిత్యం ట్రాఫిక్ జాం అవుతుంది. వన్ వే ద్వారా వాహనాల రాకపోకలు కొనసాగుతుండటంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు నిర్మాణం పూర్తిచేసిన బ్రిడ్జి అంచు కోతకు గురవడంతో పాటు దారి పై తాత్కాలికంగా వేసిన బీటీ దెబ్బతిని గుంతలు ఏర్పడి వాహనాలు నిలిచి తీవ్ర అంతరాయం ఏర్పడుతుండటంతో ఇబ్బందులుపడుతున్నారు. ప్రతి నిత్యం ట్రాఫిక్ జాం అవుతున్నా పట్టించుకున్న వారు లేకపోవడంతో పాటు పనులు వేగవంతం చేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వహిస్తుంటడం పట్ల ప్రయాణికులు మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు మొద్దునిద్ర వీడి బ్రిడ్జి నిర్మాణం పనులను గాడినపెట్టి ట్రాఫిక్ కష్టాలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

తల్లి పేరుతో మొక్కలు నాటాలి

● బీజేపీ మండల అధ్యక్షుడు

వర్గల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ 11 సంవత్సరాల ప్రభుత్వం పూర్తి చేసుకున్న సందర్భంగా మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు ఆదేశాల మేరకు సోమవారం వర్గల్ మండలం అంబర్‌పేటలో మండల పార్టీ అధ్యక్షులు బొల్లిపల్లి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో మాకే నామ్‌పే ఏక్ పేడ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

అక్బర్‌పేట-భూంపల్లి ఎస్సై హరీష్

మిరుదొడ్డి, జూన్16 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలని అక్బర్‌పేట-భూంపల్లి ఎస్సై హరీష్ అన్నారు. సోమవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని విద్యార్థులకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల కాల్స్‌ను లిఫ్ట్ చేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీటీం బృందం సభ్యులు కిషన్, మమత, శిరిష, సిబ్బంది ప్రవీణ్, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

చేర్యాలలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

చేర్యాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని వాసవీగార్డెన్స్‌లో సోమవారం చేర్యాల పట్టణ, రూరల్ మండలం, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసందర్భంగా జిల్లా అబ్జర్వర్లు పవన్ మల్లాడి, మేనేని రోహిత్‌రావు హాజరవగా, జనగామ డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి తదితరులు మాట్లాడారు.

అనుమతిలేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

చేర్యాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అనుమతులులేకుండా చేర్యాల పట్టణంలో అక్రమంగా కొనసాగిస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ నాయకులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ హైమావతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా వర్కింగ్‌ప్రెసిడెంట్ రామగల్ల నరేశ్ మాట్లాడుతూ విద్యాశాఖ నుంచి అనుమతులు పొందకుండానే కార్పొరేట్ విద్య పేరిట పాఠశాలను కొనసాగిస్తున్నారన్నారు. వెంటనే పాఠశాలపై చర్యలు తీసుకుని పేద విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

సర్కారు స్కూల్లో సీపీఐ నాయకుడి కుమారుడు

చేర్యాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు అందె అశోక్ తన కుమారుడు యశ్వంత్‌ను సోమవారం గ్రామంలోని ప్రభుత్వ జెడ్పీహెచ్ఎస్ లో 6వతరగతిలో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందామని లక్ష్యంతో తన కుమారుడిని చేర్పించినట్లు ఆయన ఈ సందర్భంగా చెప్పారు. ఆయనను పలువురు అభినందించారు.


మద్దూరులో రైతు నేస్తం కార్యక్రమాన్ని వీక్షిస్తున్న రైతులు


మహ్మదాపూర్ రైతు వేదికలోపాల్గొన్న అధికారులు, రైతులు

రైతు నేస్తానికి స్పందన


కోహెడ మండలంలో శనిగారంలో సీఎం వీడియో కాన్ఫ రెన్స్‌లో కలెక్టర్ హైమావతి

జిల్లాలోని రైతు వేదికలపై సోమవారం నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్‌కు మంచి స్పందన వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో మాట్లాడారు. జిల్లాలోని మొత్తం 71 రైతు వేదికల్లో ఈ కార్యక్రమం జరిగింది. పలు చోట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కోహెడ మండలం శనిగారంలో రైతు నేస్తం కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హైమావతి పాల్గొన్నారు.

-న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి

రేణుకా ఎల్లమ్మ దేవాలయ హుండీ లెక్కింపు

●రూ. 9.90 లక్షల ఆదాయం

హుస్నాబాద్‌రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ దేవాలయ హుండీని సోమవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో లెక్కించారు. దేవాలయ మండపంలో గోమాతా సేవా పరిషత్, రాజేశ్వర సేవాసమితి సభ్యులు, ఆలయ అర్చకులు ఇటీవల జాతీయ జరిగిన నేపథ్యంలో హుండీని లెక్కించారు. జాతర సందర్భంగా దేవాలయానికి రూ. 9.90,957 లక్షల ఆదాయం వచ్చినట్లు కార్యానిర్వాహణ అధికారి పి. కిషన్‌రావు తెలిపారు. గతంలో కంటే ఈ ఏడాది రూ. 14 వేల ఆదాయం ఎక్కువగా వచ్చినట్లు తెలిపారు. జాతర సందర్భంగా వచ్చిన మిశ్రమ వెండి, బంగారం తిరిగి హుండీలో వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉలయ ఉత్సవ కమిటీ సభ్యులు, గౌడ సంఘం నాయకులు, పూజారులు ఉన్నారు.

'మాకు పెన్షన్ ఇప్పించండి'


పీఎఫ్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు

సిద్దిపేట అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): హయ్యర్ పెన్షన్‌కు దరఖాస్తు చేసుకొని డీడీ కట్టిన తర్వాత హైదరాబాద్ కార్యాలయం నుంచి పెన్షన్ రిలీజ్ అయి మూడు నెలలు గడుస్తున్నా సిద్దిపేట పీఎఫ్ కార్యాలయం కమిషనర్ పెన్షన్ ఇప్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పీఎఫ్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి మీడియాతో మాట్లాడారు. 2014 సెప్టెంబర్ తర్వాత హయ్యర్ పెన్షన్ అమల్లోకి వచ్చిందని ఆ తర్వాత రిటైర్డ్ అయిన ఎంప్లాయిస్ హయ్యర్ పెన్షన్ కోసం డీడీలు కూడా కట్టారని తెలిపారు. గతంలో 70 మందికిపైగా అప్పటి కమిషనర్ ఎటువంటి ఆటంకాలు లేకుండా పెన్షన్లు రిలీజ్ చేస్తే ప్రస్తుత కమిషనర్ 26 మందికి పెన్షన్ రిలీజ్ అయి మూడు నెలలు గడుస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ తిరుపతి గౌడ్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు.. గ్రామీణ ప్రజలకు మేలు


కంటి పరీక్షలకు ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు

సిద్దిపేట రూరల్, జూన్16 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు మంచి అవకాశమని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రేవతి అన్నారు. సోమవారం నారాయణరావుపేటలో శంకర్ నేత్రాలయం హైదారాబాద్, వైద్యారోగ్య శాఖ సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రేవతి మాట్లాడుతూ ఉచిత కంటి వైద్య శిబిరానికి నారాయణరావుపేట మండలంలోని గ్రామాల ప్రజలు సిద్దిపేట రూరల్ మండలంలోని 18 గ్రామాల నుంచి ప్రజలు వైద్య శిబిరానికి వచ్చి సద్వినియోగం చేసుకున్నారన్నారు. ఈ వైద్య శిబిరాలలో 178 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా 43 మందికి కంటి ఆపరేషన్ నిమిత్తం శంకర్ నేత్రాలయం హైదారాబాద్‌కు పంపించడం జరిగిందని తెలిపారు. ఎవరికైతే ఆపరేషన్ అవసరం ఉందో వారిని బస్సులో ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్ చేసి వారికి అవసరం అగు మందులత ఇచ్చి తిరిగి ఇంటికి క్షేమంగా పంపిస్తామన్నారు.

ధూళిమిట్టలో కేజీబీవీని ఏర్పాటు చేయాలి

కొమురవెల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ధూళిమిట్టలో కేజీబీవీని ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. కొమురవెల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో ఇక్కడి కేజీబీవీ హాస్టల్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల కార్యదర్శి కర్రోళ్ల లెనిన్ రాజ్ మాట్లాడుతూ.. కొమురవెల్లి మండలంలో ఉన్న కేజీబీవీ ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ అయిందని, విద్యార్థులు పెరుగుతున్న క్రమంలో బిల్డింగ్ సరిపోవడం లేదని అన్నారు.

యమపాశాలు!

(5వ పేజీ తరువాయి..)

ఈదురుగాలులకు, వర్షాలకు ఈ కర్రలు నేలవాలితే ప్రాణాలు గాలిలో కలవాల్సిందే. వీటన్నింటినీ చక్కదిద్దాల్సిన విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది సరైన పర్యవేక్షణ చూపించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇక వంగిపోయి కనిపిస్తున్న స్తంభాలు సైతం ముప్పును సూచిస్తున్నాయి. స్తంభాలు వంగడంతో తీగలు కిందకు వేలాడుతున్నాయి.

భయం భయంగా..

జిల్లాలో గతేడాది విద్యుదాఘాతానికి 44 మంది చనిపోయారు. 73 పశువులు మృత్యువాతపడ్డాయి. క్రితం ఏడాది కూడా ప్రమాదాల సంఖ్య ఎక్కువగానే ఉంది. కాగా ప్రమాదాలు జరుగుతున్నా దిద్దుబాటు చర్యలు చేపట్టడం లేదు. పెరుగుతున్న సాంకేతికతతో విద్యుత్ ప్రమాదాలకు అడ్డుకట్ట పడాల్సిన అవసరం ఉంది. కానీ జిల్లాలో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. దీనికి స్వీయ తప్పిదాల తోపాటు విద్యుత్‌శాఖ లోటుపాట్లు కూడా లేకపోలేదు. ఈ విషయంపై ప్రత్యేక దృష్టిసారించాల్సిన అధికారులు సరైన పర్యవేక్షణ కేంద్రీకరించడం లేదు. ఇప్పటికైనా తగిన చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత లేకపోలేదు.


కొమురవెల్లి మండలం కిష్టంపేటలో పొలంలో వేలాడుతున్న తీగలు


వర్గల్ మండలం సింగాయపల్లి గ్రామసమీపంలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్


చిన్నకోడూరులోని కౌలు రైతు చెరుకు ఎల్లయ్య పొలం వద్ద చెట్ల కొమ్మల్లో విద్యుత్ తీగలు

బీజేపీ వైపే కాంగ్రెస్ నాయకుల చూపు

గజ్వేల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు బీజేపీ వైపు చూస్తున్నట్లు తెలుస్తుంది. త్వరలో స్థానిక ఎన్నికలు నేపథ్యంలో గజ్వేల్ పట్టణానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి సొంత గూటికి చేరేందుకు యత్నిస్తున్నట్లుగా ఆయన అనుచరుల ద్వారా తెలిసింది. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా భారతీయ జనతా పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన సదరు నాయకుడు అనంతరం ఎంపీ ఎన్నికల సమయంలో అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. అప్పటి నుంచి 15 నెలలుగా అధికార పార్టీలో పనిచేసినప్పటికి తనకు, తన అనుచరులకు పార్టీలో ఆశించిన స్థాయిలో గుర్తింపు లభించడం లేదని లోలోపల మదనపడుతున్న సదరు నాయకుడు తన అనుచరగణంతో ఇటీవల సమావేశమై తిరిగి బీజేపీలోకి చేరాలని నిశ్చయించుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు కార్యచరణ రూపొందించుకుంటున్నట్లు సమాచారం.

భూ భారతి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

● తహసీల్దార్ చంద్రశేఖర్‌రావు


గాజులపల్లిలో భూ భారతి రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌రావు

దౌల్తాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పెండిగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవచ్చని తహసీల్దార్ చంద్రశేఖర్‌రావు అన్నారు. సోమవారం జరిగిన భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో తహసీల్దార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాని తీసుకొచ్చిందని, రైతుల ఏదైనా భూ సమస్యలు ఉంటే గ్రామాల్లో జరిగే రెవెన్యూ సదస్సులో అధికారులకు సమస్యను తెలిపి దరఖాస్తు చేసుకోవాలని రైతులకు తెలిపారు. రెవెన్యూ సదస్సులో రైతులు ఇచ్చిన దరఖాస్తులను త్వరగా ఫీల్డ్ విచారణ చేసిన అనంతరం అన్‌లైన్‌లో పొందు పరచాలని అధికారులకు సూచించారు. అనంతరంగ్రామంలో రేషన్ షాపును పరిశీలించారు. కార్యక్రమంలో ,సీనియర్ అసిస్టెంట్ ప్రభాకర్‌రావు,అధికారులు రాజేశ్వర్,సౌజన్య,శ్రావణ్‌తదితరులు పాల్గొన్నారు.



'చదువుతో సమాజంలో గుర్తింపు'

చిన్నకోడూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) :చదువుతో సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఆత్మీయ మిత్ర బృందం అధ్యక్షుడు శంకర్ అన్నారు. ఆత్మీయ మిత్ర బృందం సిద్దిపేట వారి సహకారంతో సోమవారం మండలంలోని కమ్మర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా కష్టపడి చదివిఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పానుగంటి నర్సింహాచారి, బృందం సభ్యులు శ్రీనివాస్, శంకర్, సాయి, ప్రకాశ్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబానికి ఆర్థిక సహాయం

మద్దూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): దూళిమిట్ట మండలంలోని పొట్టిదేవుల తండాలో ఇటీవల నిరుపేద కుటుంబానికి చెందిన జాటోతు జ్యోతి, జాటోతు చందు మృతి చెందారు. విషయం తెలుసుకున్న తండా యువకులు కుటుంబానికి అండగా నిలిచి తలా కొంత వేసుకుని జ్యోతి కుటుంబానికి రూ.8 వేలు, చందు కుటుంబానికి రూ.26 వేల ఆర్థిక సహాయాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.

డ్రగ్స్ రహిత నియోజక వర్గంగా..

హుస్నాబాద్‌రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ నియోజక వర్గాన్ని డ్రగ్స్ రహిత నియోజక వర్గంగా తీర్చిదిద్దుదామని ఏసీపీ సదానందం పేర్కొన్నారు.

'ఉపాధి' పనులను పరిశీలించిన అధికారులు


కేంద్ర అధికారికి మొక్క అందజేస్తున్న కలెక్టర్

కొండపాక/ జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఉపాధి హామీ కేంద్ర గ్రామీణాభివృద్ధి డైరెక్టర్ శివశంకర్ సోమవారం పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కె. హైమావతితో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన వివిధ పనుల ప్రగతిపై చర్చించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ గరీమ అగ్రవాల్, డీఆర్‌వో జయదేవ్ ఆర్య తదితరులు ఉన్నారు. కుకునూరుపల్లి ముద్దాపూర్‌లో చేపల చెరువు పనులను పరిశీలించారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

దౌల్తాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీతో కేంద్రం శాంతి చర్చలు జరపాలని, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని మంగళవారం ఇందిరా ధర్నాచౌక్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు బుద్దిస్ట్ సొసైటీ ఇండియా జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల నర్సింహులు తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంలతో కలిసి నిర్వహిస్తున్న మహాధర్నాకు ప్రజా సంఘాలు, మాజీ మావోయిస్టులు తరలి రావాలని కోరారు. కగార్ పేరుతో ఆదివాసీలను వారికి మద్దతుగా ఉన్న మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్ పేరుతో హత్యలు చేస్తున్నారని ఆరోపించారు

తాగునీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన


పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు

సిద్దిపేట, జూన్ 16:(ఆంధ్రజ్యోతి): అమృత్ 2.0 పథకంలో భాగంగా సిద్దిపేట పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు పైప్‌లైన్ పనులు ప్రారంభించారు. పట్టణంలోని మైత్రివనంలోని ఎస్ఆర్‌నగర్, నందనవనం కాలనీలో పైప్‌లైన్ పనులకు మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, వైస్‌చైర్మన్ జంగిటి కనకరాజులతో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు శంకుస్థాపన చేశారు. పనులను సకాలంలో త్వరగా పూర్తిచేయాలని, పైప్ లైన్‌లను వేసేటప్పుడు ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు.

మహిళా సంఘాల్లో అక్రమాలకు తావు ఇవ్వొద్దు

రాయపోల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న తరుణంలో మహిళా సంఘాల్లో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా గ్రామ సంఘం అధ్యక్షులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఐకేపీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ విద్యాసాగర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన రాయపోల్‌లో జరిగిన గ్రామ సంఘం అధ్యక్షుల శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సీసీ ఎప్పటికప్పుడు బుక్స్ వెరిఫికేషన్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం మహిళలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ అందుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రైతుల భూ సమస్యల్ని పరిష్కరించాలి

●హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి



జాలపల్లిలో రైతుల దరఖాస్తులను పరిశీలిస్తున్న హుస్నాబాద్ ఆర్డీవో

మద్దూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై వచ్చే దరఖాస్తులను పరిశీలించి వాటిని పరిష్కరించే విధంగా చూడాలని హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి సూచించారు. సోమవారం ధూళిమిట్ట మండలంలోని జాలపల్లి, మద్దూరు మండలం వంగపల్లి గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు చేస్తున్న దరఖాస్తులను రికార్డులలో నమోదు చేసుకునే విషయంతో పాటు ఏయే అంశాలపై దరఖాస్తు చేసుకుంటున్నారని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు రహీం, మధుసూధన్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

గర్ల్స్ హైస్కూల్‌లో ఫుట్‌బాల్ కోచింగ్ ప్రారంభం

సిద్దిపేట కల్చరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వానికి తోడ్పాటు అందిస్తాయని సిద్దిపేట ప్రభుత్వ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోహర్ అన్నారు. సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలికల పాఠశాలలో ఉచిత ఫుట్‌బాల్ కోచింగ్ ఏర్పాటు చేశారు. గోల్ పోస్టులోకి కొట్టి ఆయన కోచింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మనోహర్, పీడీ సుజాత మాట్లాడుతూ ఉచిత కోచింగ్ ఇవ్వడానికి తమ స్కూల్‌ను ఎంచుకున్న సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులకు అక్బర్ నవాబ్, సాజిద్‌కు ధన్యవాదాలు తెలిపారు. సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఫుట్‌బాల్ కోచ్ అక్బర్ నవాబ్ ఆధ్వర్యంలో కోచింగ్ ఉంటుందన్నారు. తమ పాఠశాల నుంచి జాతీయ స్థాయికి ఫుట్‌బాల్ క్రీడాకారులు ఎదగాలని ఆకాక్షించారు.

అండర్ 19 క్రికెట్‌లో ఆరెంజ్ టీం విజయం

సిద్దిపేట కల్చరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, ఉమ్మడి మెదక్ జిల్లా ఆధ్వర్యంలో అండర్ 19 జిల్లా వన్డే మ్యాచ్‌లో సిద్దిపేట డీవైఎస్‌వో జె. వెంకట్ నర్సయ్య, సిద్దిపేట జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కలకుంట్ల మల్లికార్జున్ టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. టాస్ గెలిచి సిద్దిపేట పింక్ టీమ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. సిద్దిపేట ఆరంజ్ టీం మొదటగా బ్యాటింగ్ చేసి 45 ఓవర్లలో 185 పరుగులకు ఆల్ అవుట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సిద్దిపేట పింక్ టీం 183 పరుగులకు ఆల్ అవుట్ అయింది. పింక్ టీం కెప్టెన్ బి ఇషాంత్ 100 పరుగులు సాధించాడు. ఆరెంజ్ టీం బౌలర్ అక్షయ్ కుమార్ 8 వికెట్లు తీసి విజయంలో కీలక పాత్ర పోషించి, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

.. ఆ తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

గజ్వేల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు మర్కంటి కనకయ్య డిమాండ్ చేశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆయన నివాసంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, అంతరించిపోతున్న బీసీ కుల, చేతి వృత్తుల వల్ల చితికిపోతున్న బీసీల బతుకుల బాగు కోసం ఆర్థిక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి అధిక నిధులు కేటాయించాలన్నారు. జాబ్ క్యాలెండర్ ఊహల్లోనే కాకుండా, ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకారం 42శాతం రిజర్వేషన్లతో ఉద్యోగాలు కల్పించాలన్నారు. విద్యార్థుల ఫీజు బకాయిలను చెల్లించాలని, జ్యోతిబాపూలే విదేశీ విద్యానిధి పథకం కోటా పెంచాలని, రాజీవ్ యువ వికాసం పథకంలో ఎంపికైన వారికి నిధులు విడుదల చేయాలన్నారు.

ఎమ్మెల్యే పల్లా కోలుకోవాలని 'పట్నం'



చేర్యాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని వేడుకుంటూ బీఆర్ఎస్ పార్టీ చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల నాయకులు సోమవారం కొమురవెల్లి మల్లన్నకు పట్నం వేసి వేడుకున్నారు.